

జీవీఆర్ సేవలు అభినందనీయం

ప్రభుత్వ సాంఘిక సమీకృత బాలికల హాస్టల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.11,03,500 వెచ్చించడం అభినందనీయమని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..



ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

ప్రమాదాల నివారణపై రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ విభాగాల ప్రతినిధులతో చర్చించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

కురిచేడులో కలెక్టర్ స్పందన రేపు

ఒంగోలు అర్బన్: ప్రతి శుక్రవారం మండల స్థాయిలో కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం శుక్రవారం కురిచేడులో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కురిచేడులో గుంటక నరసారెడ్డి కళ్యాణ మండపంలో స్పందన నిర్వహిస్తారని, కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తులసి కేసు వ్యవహారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌తో చప్పిడి వెంగళరావు తదితరులు

ఒంగోలు: స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన లింగతోటి తులసి ఆత్మహత్యకు కారణమైన కేసన సాయి రాఘవేంద్రకు కఠిన శిక్షపడేలా చర్యలు చేపట్టాలని, అదే విధంగా బాధిత కుటుంబానికి అండగా నిలిచి ఆత్మస్థైర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, వైఎస్సార్ సీపీ నాయకురాలు మెడబలిమి రాజేశ్వరి, తులసి మేనత్త పిడుగురాళ్ల కోటేశ్వరి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఉదంతాన్ని ఆయనకు వివరించారు. ఇప్పటికి కూడా తులసి కుటుంబం భయభ్రాంతులకు గురవుతుందని పేర్కొన్నారు. విక్టర్ ప్రసాద్ నేరుగా ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబుతో మాట్లాడి బాధిత కుటుంబానికి రక్షణగా నిలవాలని సూచించారు. అనంతరం వారు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని కలిసి విషయాన్ని వివరించారు. దీంతో బాలినేని నేరుగా ఒంగోలు డీఎస్పీకి ఫోన్‌చేసి దర్యాప్తును వేగవంతం చేయడంతోబాటు బాధిత కుటుంబంలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

12న ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

ఒంగోలు టౌన్: జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.భరద్వాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్లేస్‌మెంట్ డ్రైవ్, హెటిరో డ్రగ్స్, షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ ప్రై.లిమిటెడ్, తిరుమల ఆటోమోటివ్స్ కంపెనీలలో జూనియర్ కెమిస్ట్, క్యూఏ, క్యూసీ, ఐటీఐ టెక్నీషియన్, మెషిన్ ఆపరేటర్ తదితర ఖాళీలను భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఏదైనా సెక్టార్‌లో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 నుంచి రూ.15 వేల జీతంతో పాటు పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు ఇస్తారన్నారు. ఇంటర్వ్యూకు ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7989244381కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

ఎంఈవోలకు వివరాలు అందజేయాలి

ఒంగోలు: అనియత విద్య బోధకులు–పర్యవేక్షకులు తమ వివరాలను మండల విద్యాశాఖ అధికారులకు అందజేయాలని అనియత విద్య బోధకులు–పర్యవేక్షకుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ కాలేషావలి బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ వివరాలకు సంబంధించి ఎంఈవోలను వివరాలు పంపాలని ఆదేశించారని, ఎంఈవోలకు సంబంధిత వివరాలు వేగవంతంగా అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు సెల్ 9177262705ను సంప్రదించాలన్నారు.

విశ్వబ్రాహ్మణులు సభ్యత్వం తీసుకోవాలి

గిద్దలూరు రూరల్: 18 ఏళ్లు నిండిన విశ్వబ్రాహ్మణులు తప్పకుండా సభ్యత్వం చేయించుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు పరిసర ప్రాంతంలో ఈ నెల 11వ తేదీ వరకు సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 99896 46378 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టీచర్ కొలువుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురిచ్చింది. వారు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ 2024 బుధవారం ప్రభుత్వం విడుదల జేసింది. ఉమ్మడి ప్రకాశంలో జిల్లాలో మొత్తం 503 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనుంది. ఈ నోటిఫికేషన్ వెలువడడంతో ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీపడుతున్న వారిలో నూతనోత్సాహం నెలకొంది. డీఎస్సీ పక్కాగా పూర్తిచేయడం ఖాయమనే భావనను పలువురు అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు.

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో భర్తీకానున్న పోస్టులు 503
- స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు 299
- సెకండరీ గ్రేడ్ పోస్టులు 111
- నోటిఫికేషన్ విడుదలతో నిరుద్యోగుల్లో హర్షం
- రాష్ట్ర స్థాయిలో భర్తీకానున్న పీజీటీ, ప్రిన్సిపాల్ పోస్టులు అదనం



ఒంగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదలచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి ప్రకాశంజిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ల పోస్టులు 503 భర్తీ కానున్నాయి. వీటిలో 111 సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులు, 299 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నా యి. ఇవి కాకుండా ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు 93 కి నోటిఫికేషన్ విడుదలైంది. ఏపీ మోడల్ స్కూల్స్, సాంఘిక సంక్షేమ సొసైటీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అవసరమైన ప్రిన్సిపాళ్లు, పోస్టు గ్రాడ్యుయే షన్ టీచర్ల భర్తీకి కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పోస్టులు రాష్ట్ర ప్రాతిపదికగా భర్తీచేయనుండడంతో జిల్లాల వారీగా కాకుండా రాష్ట్రస్థాయిలో వీటికి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు డీఈడీ తోపాటు టెట్ పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు, టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఈడీ, టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి.

12 నుంచి ప్రక్రియ ప్రారంభం

ఈనెల12వ తేదీన ప్రక్రియ ప్రారంభమవుతుంది. 21వ తేదీ వరకు పరీక్ష ఫీజును ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలి. దరఖాస్తులను 22వతేదీ వరకు సబ్‌మిట్ చేసుకోవచ్చు. 24న మాక్‌టెస్టును ప్రాక్టీస్ చేసేందుకు విద్యాశాఖ అవకాశం కల్పించింది. మార్చి 5వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మార్చి 15 నుంచి 30వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుంది. మార్చి 31న ప్రాథమిక కీ విడుదలచేసి ఏప్రిల్ 1వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఏప్రిల్ 2న తుది కీ విడుదల చేయడంతోపాటు 7వ తేదీ ఫలితాలను ప్రకటిస్తారు.

నేడు టెట్ నోటిఫికేషన్ విడుదల:

టీచర్ ఎలిజిబులిటీ టెస్టు(టెట్) పరీక్ష నోటిఫికేషన్ గురువారం జారీచేయనున్నారు. దీనికి సంబంధించి ఈనెల 17 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 18వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తును సబ్‌మిట్ చేయాలి. 19వ తేదీ ఆన్‌లైన్‌లో మాక్ టెస్టు (మోడల్ పరీక్ష) ను వినియోగించుకునే సౌలభ్యాన్ని విద్యార్థులకు కల్పించారు. 23వతేదీ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈనెల 27 నుంచి మార్చి 9వ తేదీ వరకు రెండు సెషన్స్‌లో ప్రతిరోజు విద్యార్థులకు ఆన్‌లైన్ విధానం ద్వారా నిర్ణయించిన పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

డీఎస్సీ వదలడం సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం డీఎస్సీ వదలడం సంతోషంగా ఉంది. ఇప్పటికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ఉద్యోగాలతో పాటు మరికొన్ని ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకున్నారు. ఇప్పుడు డీఎస్సీ వదిలి మరి కొంత మందికి ఉద్యోగ అవకాశం కల్పించడం ఆనందంగా ఉంది. బీఈడీ పూర్తి చేసిన నేను తప్పకుండా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటాను.

– మంచికలపాటి సాల్మన్, బీఈడీ విద్యార్థి, పొన్నలూరు

సీఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నెలబెట్టుకున్నారు. నేను బీఎస్సీ బీఈడీ చేశాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశారు. రాష్ట్రంలో 6100 డీఎస్సీ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉంది.

– ఆకుల అనూష, వెలిగండ్ల

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే సీఎం జగన్ లక్ష్యం



యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి రెండేళ్లు అయింది. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. యువత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉన్నాం. జగనన్న మళ్లీ సీఎం అయితే డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేస్తారు.

– టీ సోనియా లాబెన్, వెలిగండ్ల

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మైనంపాడు డైట్ కాలేజీలో టీటీసీ పూర్తి చేసిన తర్వాత నోటిఫికేషన్ కోసం ఎదురు చూశాను. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం వలన నాలాంటి టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది నిరుద్యోగుల్లో భరోసా కల్పించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

– చింతా శ్రీలక్ష్మి, చీమకుర్తి

ఏపీ దళిత ఆదివాసీ మేనిఫెస్టో ఆవిష్కరణ

ఒంగోలు: ఏపీ దళిత ఆదివాసీ మేనిఫెస్టో 2024ను రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కె.పేరయ్య బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంబంధిత రాజకీయ పార్టీలు ఇచ్చే భరోసా, ఎన్నికల మేనిఫెస్టో వచ్చే 5 సంవత్సరాల ప్రజల భవిష్యత్తుతో పాటు దేశ ప్రజాస్వామ్య లక్ష్యాలను సాధించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టో ఎలా ఉండాలి, ఎవరి కోసం తయారు చేయాలి, ఏఏ అంశాలకు పెద్ద పీట వేయాలనేది ప్రతి రాజకీయ పార్టీ ముందున్న సవాల్ అని అన్నారు. ప్రజలందరి ఆమోదం పొందేలా మేనిఫెస్టో రూపొందించడం కూడా రాజకీయ పార్టీలకు కఠిన పరీక్షని అన్నారు. కార్యక్రమంలో దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి నరసింహారావు, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, ఏపీ గిరిజన యానాది సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఈగ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే పథకంలో భాగస్వాములు కావాలి

చీమకుర్తి: నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టం (నమస్తే) పథకంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు కోరారు. ఆ మేరకు బుధవారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. నమస్తే పథకం ప్రాధాన్యతను తెలియజేశారు. మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, పట్టణ గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి



దర్శి పదో వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, నందిని



ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి (ముండ్లమూరు): సంక్షేమ రాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక లంకోజనపల్లి రోడ్‌లోని పదో వార్డులో బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్‌సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి నందిని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు నమస్కారం చేస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా శివప్రసాదరెడ్డిని గెలిపించాలని కోరారు. బూచేపల్లి కుటుంబం 20 ఏళ్లుగా నిస్వార్థంగా దర్శి ప్రజలకు సేవచేస్తూ అండగా నిలిచామన్నారు. ఎవరికి ఎలాంటి ఆపదవచ్చినా ఆదుకుంటున్నామని తెలిపారు. మా కుటుంబంపై నమ్మకంతో జగనన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బూచేపల్లి శివప్రసాదరెడ్డిని నియమించినందున మీలో ఒక బిడ్డగా, సోదరుడిగా ఆదరించి త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇస్త్రీ చేసి మీ కష్టాలను తీర్చేందుకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఆటోలలో కూలి పనులకు వెళ్తున్న కూలీలు బూచేపల్లి వెంకాయమ్మ, నందిని లను చూసి ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో కాపా రమణారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీపీ సుధా అచ్చయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూడి దేవప్రసాద్, బీసీ సెల్ జిల్లా సెక్రటరీ చెరుకూరి జగన్‌మోహన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, పాశం జయసింహ, పసుపులేటి గురవయ్య, శేషయ్య ఆరేటి సురేష్, సందిరెడ్డి వెంకటరెడ్డి, రాజశేఖరరెడ్డి, తాతిరెడ్డి కొండారెడ్డి, పానుగంటి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ దామెర్ల రమణచంద్ర, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, కౌన్సిలర్లు జగన్నాథం మోహనబాబు, మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబురావు, కర్ణా భాస్కరరెడ్డి, మజ్జువలి, పుట్టా రవి, సోషల్‌మీడియా కోఆర్డినేటర్ యరమల మధురెడ్డి, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, ఐఆర్‌సీఎస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కపురం శ్రీనివాసరెడ్డి, ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి బొమ్మిరెడ్డి అంకబాబు, నాయకులు ఎదురు నారాయణరెడ్డి, కర్ణా వెంకటరెడ్డి, బండారు బాబు, కొడవటి జాన్, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, పానుగంటి కోటేశ్వరరెడ్డి, భాస్కరరెడ్డి, చెవిరెడ్డి రాజారెడ్డి, వేమిరెడ్డి నాగ ప్రసాదరెడ్డి, వెన్నపూస చెన్నారెడ్డి, యన్నం సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెప్మాలో అక్రమాలు జరిగితే సిట్ వేయాలి

- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కోరిన మేయర్
- జాయింట్ లయబులిటీ గ్రూపులు రుణాలు తీసుకొని రెండేళ్లుగా కట్టడం లేదు
- అక్రమాలు జరిగాయని పచ్చ మీడియా అసత్య కథనాలు రాస్తోంది
- గ్రూపులు రుణాలు తీసుకొని కట్టకపోతే దానిని బాలినేనికి ఆపాదిస్తారా
- బ్యాంకు మేనేజర్లు అక్రమాలకు పాల్పడితే అధికార పార్టీ నాయకులకు ఏంటి సంబంధం
- విలేకరులతో మేయర్ గంగాడ సుజాత



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: మెప్మాలో అక్రమాలు జరిగాయని పచ్చ మీడియా, పచ్చ పత్రికలు అసత్య కథనాలు రాస్తున్నారని పలువురు కార్పొరేటర్లతో కలిసి ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర పాలకసంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పచ్చ మీడియా, పచ్చ పత్రికలు, టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టారు. జేఎల్‌జీ గ్రూపులకు బ్యాంకులు రుణాలు ఇస్తే.. వాటిని కట్టకపోతే దానికీ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డికి ఏమిటి సంబంధం అని నిలదీశారు. బ్యాంకు రుణాలు తినేయటంలో మేయర్ పాత్ర కూడా ఉందని పచ్చ మీడియా, పచ్చ పత్రికలు రాయటం ఎంత వరకు న్యాయమని నిలదీశారు. ఎక్కడ ఏం జరిగినా బాలినేని శ్రీనివాస రెడ్డి మీద, ఆయన కుటుంబం మీద అసత్యాలు రాయటం మానుకోకపోతే సహించేదిలేదని హెచ్చరించారు. చీమచిటుక్కుమంటే బాలినేనే గుర్తుకు రావటం నీచ రాజకీయమని మండిపడ్డారు. మెప్మా గ్రూపుల్లో రుణాలు తీసుకొని ఎవరు ఎగ్గొట్టారో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. అందుకే కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్‌ను కోరుతున్నామని, ఈ విషయమై సిట్ వేయాలని డిమాండ్ చేశారు. సిట్ ద్వారా ఎవరు అక్రమాలకు పాల్పడ్డారో తేలిపోతుందని, ఏ పార్టీ వాళ్లు ఉన్నా చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలు నగరంలో 4500 గ్రూపులు ఉన్నాయని, వాటిల్లో 45 వేల మంది సభ్యులు ఉన్నారని, వాళ్లలో అన్ని పార్టీల వాళ్లు కూడా ఉన్నారు. ప్రధానంగా జేఎల్‌జీ గ్రూపుల్లో టీడీపీ వాళ్లే ఎక్కువగా ఉన్నారని గుర్తు చేశారు. మెప్మా గ్రూపులతో పాటు అదే సభ్యులు జేఎల్‌జీ గ్రూపులు కూడా ఏర్పాటు చేసుకొని ఒక్కో గ్రూపు రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. అదికూడా 2022 ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో 18 గ్రూపులు, కెనరా బ్యాంకులో 6 గ్రూపులు, యూనియన్ బ్యాంకులో 9 గ్రూపులు, పీడీసీసీ బ్యాంకులో 16 గ్రూపులు ఇలాంటి రుణాలు తీసుకొని ఉన్నారు. కాకుంటే వాళ్లు కట్టడం లేదని ఆయా బ్యాంకులు మెప్మా పీడీకి లేఖలు రాశారు. బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు ఎన్ని ఆంక్షలు పెడతారో అందరికీ తెలుసన్నారు. ఊరికే రూ.20 లక్షలు ఇస్తారా అని నిలదీశారు. బ్యాంకు మేనేజర్లు ఎలాంటి అక్రమాలకు పాల్పడకుండా రుణాలు ఇచ్చారా, ఇస్తే వాటిని తిరిగి వసూలు చేసుకోవటానికి వారివద్ద ఎలాంటి షూరిటీలు, తనఖాలు పెట్టుకోకుండానే రుణాలు ఉద్దరగా ఇస్తారా అని కూడా నిలదీశారు. టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారు.. బ్యాంకు మేనేజరు అమాయకులంట, నెపం మాత్రం బాలినేని మీద, నామీద వేస్తారా సిగ్గు లేదా అని హెచ్చరించారు. నేను రూ.40 లక్షలు రుణం తీసుకోవటానికి ఆరు నెలలు పట్టింది ఆస్తులకు సంబంధించిన అన్ని రకాల డాక్యుమెంట్లు పెట్టుకొని కూడా రుణం ఇవ్వటానికి అంత సమయం పట్టింది. మరి బ్యాంకు మేనేజర్లు ఎలాంటి అక్రమాలకు పాల్పడి రుణాలు ఇచ్చారో సిట్ ద్వారా తేల్చాలని నిలదీశారు. సమావేశంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, కార్పొరేటర్లు బెంగళూరు నర్సయ్య, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, నాగం శేషయ్య, అంగిరేకుల గురవయ్యలు కూడా పచ్చ మీడియా, పచ్చ పత్రికలు, టీడీపీ నాయకులు చేస్తున్న కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టారు. ఇలాంటి అసత్య ప్రచారాలు, పుకార్లు చేస్తే వాళ్ల ఇళ్ల వద్ద ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ బద్రీనాథ్



బద్రీనాథ్‌ని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మార్కాపురం: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీనాథ్ అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో బద్రీనాథ్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఒకవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి పెద్దఎత్తున జరుగుతుండటంతో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. సాంకేతిక కారణాలతోనే విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ అందడంలో జాప్యం జరిగిందని, ప్రభుత్వం ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తుందన్నారు. ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పారదర్శకమైన పాలన అందిస్తున్నారన్నారు. అనంతరం బద్రీనాథ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ ఐ బాలసుబ్బారావు, ఆఫీసర్స్ క్లబ్ అధ్యక్షుడు శంకర్, సంఘం నాయకులు చెంచయ్య, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ దినేష్ కుమార్



అల్లూరు సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

కొత్తపట్నం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కింద మంజూరు చేసిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఇళ్ల పట్టాలపై ఆకస్మిక తనిఖీ చేశారు. నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, పేదలందరికీ ఇచ్చిన ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడుతూ వారికి ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు కట్టించే ఏర్పాటు చేసిందన్నారు. వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి వారికి సర్వ హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటోందన్నారు. అల్లూరు గ్రామంలో జగనన్న లే అవుట్స్‌లో 318 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేసిందని, అందులో ఇప్పటి వరకు 186 మందికి రిజిస్ట్రేషన్ చేసినట్లు తహసీల్దార్ సురేష్ కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, డీటీ అర్జున్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం చేయూత

- రామతీర్థం రిజర్వాయర్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మీనోత్సవం



చేప పిల్లలను వదులుతున్న మత్స్యశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: మత్స్యకారుల జీవనోపాధికి ప్రభుత్వం చేయూత ఇస్తున్నట్లు చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ గోపవరపు రాజ్యలక్ష్మి, పూర్ణచంద్రరావు అన్నారు. రామతీర్థం రిజర్వాయర్‌లో బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలే కార్యక్రమం (మీనోత్సవం) నిర్వహించారు. రామతీర్థం రిజర్వాయర్‌లో ప్రభుత్వమే చేప పిల్లలను కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారుల జీవనం మరింత మెరుగుపరచడానికి ఫిష్ ఆంధ్ర, ద్విచక్ర వాహనాలు, బీమా వంటి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. రామతీర్థం ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులకు మత్స్యకారుల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు రామతీర్థం రిజర్వాయర్‌లో 1.60 లక్షల చేప పిల్లలను వదిలినట్లు జిల్లా మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎ ఉషాకిరణ్ తెలిపారు. కార్యక్రమంలో దేవరపాలెం పంచాయతీ వైస్ సర్పంచి చిన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంగిరెడ్డి ఓబులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమిడి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ బూచేపల్లి నాగిరెడ్డి, మత్స్య అభివృద్ధి అధికారి డి.ఆషా, గ్రామ మత్స్య సహాయకులు సీహెచ్ ఏడుకొండలు రెడ్డి, రామతీర్థ గిరిజన జాలర్ల సంఘ సభ్యులు, మాజీ సెక్రటరీ పాలపర్తి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

143 మద్యం బాటిళ్లు స్వాధీనం


పోలీసుల అదుపులో మద్యం బాటిళ్లు, కారు

పీసీపల్లి: అక్రమంగా మద్యం అమ్ముతున్న యువకులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని పెదయిర్లపాడు అక్రమంగా మద్యం అమ్ముతున్న తమ్మినేని వినోద్, కొండ్రెడ్డి సాయి కృష్ణా రెడ్డిలను పోలీసులు అరెస్టు చేసి కారు, ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 143 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సైమన్ తెలిపారు.

జీవీఆర్ సేవలు అభినందనీయం

- కొత్తపట్నం బాలికల హాస్టల్లో రూ.11 లక్షలతో మౌలిక వసతులు
- అభివృద్ధి పనులను ప్రారంభించిన కలెక్టర్ దినేష్ కుమార్
- కార్పొరేట్ హాస్టల్ కంటే మిన్నగా ఉందని కితాబు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కొత్తపట్నం: ప్రభుత్వ సాంఘిక సమీకృత బాలికల హాస్టల్లో మౌలిక వసతుల కల్పనకు జీవీఆర్ సంస్థ రూ.11,03,500 వెచ్చించడం అభినందనీయమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. హాస్టల్ ఆధునికీకరణకు కృషి చేసిన జీవీఆర్ సంస్థ డైరెక్టర్లు భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసరావు, గ్రంధి చల్లారావు, గ్రంధి బాలాజీ సేవలను ప్రశంసించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాసరావు, సోదరులు వారి తండ్రి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కొత్తపట్నంలోని బాలికల హాస్టల్లో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం కలెక్టర్ పారంభించారు. రూ.11 లక్షలకు పైగా వెచ్చించి ఏర్పాటు చేసిన డీప్ బోరు, విద్యుత్ మోటార్, సీసీ కెమెరాలు, సోలార్ వాటర్ హీటర్, మంచాలు, తాగు నీరు ఫిల్టర్, పైపులు, మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. జీవీఆర్ సంస్థ మేనేజర్ పిన్ని బంగారయ్య, పిన్ని వెంకటేశ్వర్లును కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చించి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు, వివిధ కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమన్వయంతో ముందడుగు వేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. గత ఏడాది 10వ తరగతి పరీక్షల్లో కొత్తపట్నం బాలికల వసతి గృహం విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది కూడా నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలని సూచించారు.


మౌలిక వసతుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

జీవీఆర్ సంస్థ మేనేజర్ బంగారయ్య మాట్లాడుతూ.. వార్డెన్ అరుణకుమారి విజ్ఞప్తిని జీవీఆర్ సంస్థ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పేద పిల్లలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తోందన్నారు. అనంతరం జీవీఆర్ సంస్థ ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు కలిసి కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్, హాస్టల్ వార్డెన్ అరుణకుమారి, పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, చాపల చిరంజీవి, బలగాని యనాదిరావు, సోమరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మృతి చెందిన హనుమంతరావు

ముండ్లమూరు(కురిచేడు): ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ సంఘటన ముండ్లమూరు మండలంలోని పసుపుగల్లు గ్రామం వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు.. సంతనూతలపాడు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన ఎ.హనుమంతరావు(52) దర్శి వైపు నుంచి ముండ్లమూరు వైపు తన బైక్‌పై వెళ్తున్నారు. పసుపుగల్లు వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో హనుమంతరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న వారు 108కి సమాచారం అందించారు. క్షతగాత్రుడికి అంబులెన్స్ సిబ్బంది కె.వరకుమార్, కె.నరేష్ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పొదిలి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం స్థానిక టైలర్స్ కాలనీలో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మాగులూరి రవికుమార్(39) అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. టైలర్స్ కాలనీలోనే మరొక ఇంట్లో చీరకు ఉరేసుకుని మృతి చెందాడు. రవికుమార్‌కు కొంత కాలంగా అక్రమ సంబంధం ఉందని పోలీసులు తెలిపారు. ఈక్రమంలో ఉరివేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య సలోమి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రంగారావు తెలిపారు.

మనమంతా జగనన్న సైనికులం

- కనిగిరి కొండపై మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం
- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్


పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్, పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి తదితరులు

కనిగిరి రూరల్: మనమంతా జగనన్న సైనికులం ... త్వరలో జరగనున్న ఎన్నికల్లో సమష్టిగా కలిసి పనిచేద్దాం.. కనిగిరి కొండపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. వైఎస్సార్ సీపీ నూతన పార్టీ కార్యాలయాన్ని బుధవారం డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధిని అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారార్థీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ ఫలాలను అందచేసినట్లు వివరించారు. టీడీపీ పాలనలో పచ్చచొక్కాల వారికే సంక్షేమ పథకాలు దక్కేవని తెలిపారు. చంద్రబాబు, దత్త పుత్రుడు లోకేష్‌లు ఎన్నిక కుయుక్తులు పన్నినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. టీడీపీ హయాంలో దోచుకో..దాచుకో..పంచుకో తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. 600 హామీలను ఇచ్చిన ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని తీవ్రంగా ధ్వజమెత్తారు. మళ్లీ ఎన్నికలు వచ్చే సరికి కొత్త కుట్రలు, పొత్తులు, డ్రామాలతో ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకు కుయుక్తులు పన్నుతున్నాడని ఘాటుగా విమర్శించారు. మీ కుటుంబానికి మంచి జరిగితేనే ఓటు వేయాలని కోరుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని కొనియాడారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీ కార్యక్రమాలన్నీ ఇక్కడి నుంచే..

సమయాభావం వల్ల పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి కొందర్ని పిలువలేకపోయానని మన్నించాలని పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఇక ఇప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలన్నీ నూతన కార్యాలయం నుంచే అమలు జరుగుతాయని చెప్పారు. పార్టీ సీనియర్ నాయకుల సూచనలు సలహాలతో పార్టీ కార్యక్రమాల కార్యాచరణ అమలు జరుగుతుందని తెలిపారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, అందరూ సహకరించాలన్నారు. మనమంతా కలిసికట్టుగా రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ), మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, రామన తిరుపతి రెడ్డి, రామనలక్ష్మమ్మ, అత్యాల జషన్య, ఓకే రెడ్డి, వైస్ చైర్మన్లు పులిశాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎస్‌కే చాంద్‌బాషా,(బుజ్జీ), పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి తమ్మినేని సుజాతరెడ్డి, చింతం శ్రీను, పెన్నా ఏడుకొండలు, దాసరి మురళీ, భవనం కృష్ణారెడ్డి, పార్టీ మండల కార్యదర్శులు జి. బొర్రారెడ్డి, యక్కంటి శ్రీను, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణ రెడ్డి, నరాల రమణారెడ్డి, బాదం సత్యం, పాలు జయరాంరెడ్డి, ఎస్‌కే ఖాజా, మీరావలి, మార్తాల వెంకటేశ్వర్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, మూలె గోపాల్‌రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ఉడుముల లక్ష్మీనారాయణరెడ్డి, సిద్దారెడ్డి, శ్రీహరి రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తొగురు పిచ్చయ్య, శ్రీరాం సతీష్, మాలీ యాదవ్, వై మోహన్‌రెడ్డి, ఖాశింసా, లతీఫ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోస్టు ద్వారా ఓటరు కార్డులు పంపిణీ


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ

ఒంగోలు అర్బన్: జిల్లాకు సుమారు 1,50,000 ఓటరు కార్డులు వచ్చాయని, వాటిని పోస్టాఫీస్ ద్వారా రిజిస్టర్ పోస్టుతో ఓటర్లకు చేరేలా చర్యలు తీసుకున్నామని ఆర్డీఓ విశ్వేశ్వరరావు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు అందిన ఫారం 6,7,8లను పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ప్రకటించగానే రాజకీయ పార్టీలు కోడ్ నిబంధనలు పాటించాలన్నారు. పోలింగ్‌కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీటీ అజయ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కటారి సంజీవ, రసూల్, రాజశేఖర్, సత్యం, రమేష్, స్వరూప్, కట్టా శ్రీదేవి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

గ్రూప్–1 కోసం దరఖాస్తుల ఆహ్వానం

యర్రగొండపాలెం: గ్రూప్–1 పరీక్షలకు హాజరయ్యే చెంచు గిరిజన అభ్యర్థులకు శ్రీశైలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏపీవో బి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. అభ్యర్థి పేరు, తండ్రి పేరు, కులం, పూర్తి చిరునామా, అర్హత, గ్రూప్–1 రిజిస్ట్రేషన్ ఫారం, ఆధార్, మొబైల్ నంబర్లు ఐటీడీఏ శ్రీశైలం కార్యాలయానికి అందజేయాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని చెంచు అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవలని ఆయన కోరారు.



ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

- సమాజంలోని వివిధ విభాగాల ప్రతినిధులతో చర్చ
- చర్చల్లో వచ్చిన అంశాల ఆధారంగా తగు ఆదేశాలు జారీ


రహదారి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్న రవాణాశాఖ ఉప కమిషనర్ సుశీల

ఒంగోలు: ప్రమాదాల నివారణపై రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల ప్రత్యేక దృష్టి సారించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానించి, రహదారి భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌అండ్‌బి అధికారులు, వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు, జాతీయ రహదారుల శాఖ అధికారులు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణులతోపాటు మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు. స్థానిక రైజ్ ఇంజినీరింగ్, పేస్ ఇంజినీరింగ్ కాలేజీల సమీపంలో సర్వీస్ రోడ్లు, రోడ్ మార్కింగ్, స్పీడ్ కంట్రోలర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రవాణా శాఖ ఉప కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు వారంలో రెండు లేదా మూడు రోజులు పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ రహదారి 544డీపై పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామ సమీపంలో ఫ్లయ్ ఓవర్ వద్ద కారు–ఆటో ప్రమాదంపై సమీక్షించారు. కారు డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం సంభవించినట్లు నిర్ధారణకు వచ్చారు. హైవేపై గ్రామాల సమీపంలో సర్వీసు రోడ్ల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జాతీయ రహదారి 565పై దర్శి వద్ద జరిగిన బస్సు ప్రమాదానికి బ్రిడ్జి ఇరుకుగా ఉండటం కారణం కావచ్చని భావించి సైన్‌బోర్డులు, ఇసుకతో నింపిన ముప్పాతిక భాగం బ్యారెల్స్ ఉంచాలని, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హైవేపై గ్రామాల సమీపాల్లో పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున ఇనుప కంచెలు ఏర్పాటు చేయాలని హైవే అధికారులను కోరారు. మార్కాపురం బైపాస్ వద్ద హోర్డింగ్‌ల తొలగింపు, ట్రాఫిక్ దృష్ట్యా రోడ్డు మధ్యలో ఉన్న చెట్లను ట్రిమ్ చేయాలని అభిప్రాయపడ్డారు. చినారికట్ల, పెదారికట్ల, రాయవరం, బేస్తవారిపేట తదితర ప్రాంతాల్లో రోడ్డు ఆక్రమణలకు గురై పాదచారులు నడిచేందుకు వీల్లేకుండా ఉన్నందున ఆక్రమణల తొలగింపు, వాహనాల రద్దీ దృష్ట్యా చీమకుర్తి–ఒంగోలు రహదారి వెడల్పు గురించి, అదే విధంగా పలుచోట్ల మరమ్మతులు చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. హైవేపై ప్రమాదాలు సంభవించినపుడు 108తోపాటు 1033 అంబులెన్స్ సర్వీసులను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

9 నుంచి ప్రకాశం బాలోత్సవం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరావు

ఒంగోలు టౌన్: ఈ నెల 9,10వ తేదీల్లో ఒంగోలు నగరంలోని పీవీఆర్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న బాలోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ గౌరవాధ్యక్షుడు పాటిబండ్ల ఆనందరావు పిలుపునిచ్చారు. బుధవారం ఎల్బీజీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలోత్సవంలో సుమారు 50 రకాలకు పైగా అకడమిక్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ రాష్ట్ర కన్వీనర్ రామరాజు తెలిపారు. ఈ ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. విద్యార్థుల మానసిక వికాసానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఒంగోలులో బాలోత్సవం నిర్వహణ సంతోషంగా ఉందని, రోటరీ క్లబ్ సెంట్రల్ నాయకుడు లక్ష్మీనారాయణ అన్నారు. సమావేశంలో కమిటీ నాయకులు కొమ్మోజి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యాచారి, కార్యదర్శులు వీరాంజనేయులు, బాలకోటయ్య, హరిబాబు, కోశాధికారి ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ సహాయ కమిషనర్

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం–1988 ప్రకారం మెడికల్ షాపుల నిర్వాహకులు ఈనెల 29లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సహాయ కార్మిక శాఖ కమిషనర్ కె.భవానీ స్పష్టం చేశారు. బుధవారం ఒంగోలు వీఐపీ రోడ్డులోని డ్రగ్ కంట్రోల్ కార్యాలయంలో ఫార్మసిస్ట్ అసోసియేషన్ నాయకులకు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుకాణాల్లో కార్మికులు పనిచేస్తున్నా లేకపోయినా రిజిస్ట్రేషన్ మాత్రం తప్పనిసరి అని చెప్పారు. సచివాలయం, మీ సేవలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారులు ఎం.వెంకటేశ్వర్లు, ఎం.ఎలిజబెత్తమ్మ, అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకారెడ్డి, కార్యదర్శి వేమూరి సుబ్బారావు, కోశాధికారి వి.ఏడుకొండలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మైనంపాడు క్రీడాకారులు


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: రాష్ట్ర స్థాయి హాకీ సబ్ జూనియర్ పోటీలకు సంతనూతలపాడు మండలం మైనంపాడు డైట్ కాలేజీ విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ రవికుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల ఒంగోలులో నిర్వహించిన పోటీల్లో బాలుర జట్టుకు విజయరాజు, గౌతమ్, చరణ్, కైలాస్, యశ్వంత్, అశోక్, మల్లికార్జున, బాలికల జట్టుకు శృతి, లోహిత, ఆయేషాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీకాకుళంలో బాలికల జట్టు, 10 నుంచి 12 వరకు కర్నూలులో బాలుర జట్టు హాకీలో తలపడనున్నాయని పీఈటీ తెలిపారు.